సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 14 । సెప్టెంబర్ । 2023



ముమ్మరంగా స్వమిత్వ సర్వే

స్వమిత్వ పథకంలో దశలవారీగా సర్వే వేగంగా సాగుతోంది. మొదటి దశ ఇప్పటికే పూర్తి కాగా..ప్రస్తుతం రెండో దశ సర్వే జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా సాగుతోంది. 8లో



ఫెన్సింగ్‌లో పతకాల పంట

కాకినాడలో నిర్వహించిన ఫెన్సింగ్ పోటీల్లో పశ్చిమ గోదావరికి చెందిన పలువురు విద్యార్థులు బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించారు. 8లో



దోపిడీ ముఠా కోసం గాలింపు

తణుకులో బంగారం దోపిడీ ఘటనలో దుండగులను పట్టుకునేందుకు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించే ప్రయత్నం చేసింది. 8లో

న్యూస్‌రీల్

మధ్యాహ్న భోజన పథకం పరిశీలన



మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

పాలకోడేరు: పాలకోడేరు మండలం పెన్నాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను జాతీయ ఆహార భద్రతా చట్ట పర్యవేక్షకులు డాక్టర్ ఉపేంద్ర సింగ్ బృందం బుధవారం పరిశీలించారు. రోజువారీ మెనూ పరిశీలించడమే కాకుండా బియ్యం, గుడ్లు, చిక్కీలు, రాగి పిండి నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో మాట్లాడి భోజన పదార్థాల గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు హాజరైన అందరు విద్యార్థులు మధ్యాహ్న భోజన పథకంలో భోజనం చేయటం ఆనందంగా ఉందన్నారు. గ్యాస్ సబ్సిడీ రేటుపై ఇవ్వాలని, గౌరవ వేతనం పెంచాలని, వంట చార్జీలు పెంచాలని నోడల్ అధికారిని కోరారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన, పాఠశాల పారిశుధ్య జిల్లా సమన్వయ కర్తలు కె.కృష్ణారావు, జి.చిన్నయ్య, ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్ అమీర్ ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గాంధీ జయంతి సందర్భంగా పోటీలు

నరసాపురం: వైఎన్ కళాశాల గాంధీ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో గాంధీజీ 157వ జయంతి సందర్భంగా ఈనెల 21, 22 తేదీల్లో స్కూల్, కాలేజ్ విద్యార్థులకు జిల్లాస్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఏపీవీ అప్పారావు చెప్పారు. 21న మధ్యాహ్నం 1 గంటకు స్కూల్ విద్యార్థులకు స్వాతంత్య్ర సమర యోధుల వేషధారణలపై పోటీలు ఉంటాయని చెప్పారు. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు స్కూల్, కళాశాలల విద్యార్థులకు క్లీన్ అండ్ గ్రీన్ అంశంపై డ్రాయింగ్ పోటీలు ఉంటాయన్నారు. 22న కళాశాల విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి కాలుష్యాన్ని నివారించండి... భూమిని కాపాడండి అనే అంశంపై వక్తృత్వ పోటీలు, మధ్యాహ్నం 3 గంటల నుంచి ప్రపంచ దేశాల్లో నేడు గాంధీజీ సిద్ధాంతాల ఆవశ్యకత అంశంపై వ్యాసరచన పోటీలు ఉంటాయని చెప్పారు.

ఆపన్నులకు అండగా సీఎం జగన్



ఏలూరు క్యాంపు కార్యాలయంలో ఆర్థిక సాయాన్ని అందజేస్తోన్న ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు టౌన్: ఏలూరు నగరానికి చెందిన ఒక కుటుంబం రోడ్డు ప్రమాదంలో కుటుంబ పెద్దను కోల్పోయింది. కుటుంబ పెద్ద లేకపోవటంతో ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న కుటుంబానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండగా నిలబడింది. ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని నేనున్నానంటూ భరోసా కల్పించారు. శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో బాధిత మహిళకు ప్రమాద బీమా రూ.5 లక్షలు అందజేయటమే కాకుండా, వితంతు పెన్షన్ అందజేసి అండగా నిలిచారు. ఏలూరు 15వ డివిజన్‌కు చెందిన కొయ్య శ్యామల భర్త నరసారెడ్డి ఈ ఏడాది ఏప్రిల్ 5న రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ఈ విషయం ఆళ్ల నానికి తెలియడంతో ఆ కుటుంబానికి బాసటగా నిలవాలని ఆదేశాలు జారీచేశారు. సచివాలయ సిబ్బంది వైఎస్సార్ ప్రమాద బీమాకు దరఖాస్తు చేయించారు. ఆమెకు వితంతు పెన్షన్ కోసం ఆన్‌లైన్ చేశారు.

19 నుంచి డీఈఎల్‌ఈడీ పరీక్షలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): డీఈఎల్‌డీ ప్రథమ సెమిస్టర్, 4వ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 19వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని జిల్లా విద్యాశాఖాధికారి పీ.శ్యామ్ సుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలు ఈ నెల 25 వరకూ కొనసాగుతాయని స్పష్టం చేశారు. ప్రథమ సెమిస్టర్ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకూ, 4వ సెమిస్టర్ పరీక్షలు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ జరుగుతాయన్నారు.

15న ఎంప్లాయి గ్రీవెన్స్

ఏలూరు(మెట్రో): జిల్లాలోని ఉద్యోగుల నుంచి ఫిర్యాదుల స్వీకరణకు 'ఎంప్లాయి గ్రీవెన్స్' కార్యక్రమాన్ని ఈ నెల 15న సాయంత్రం 4 గంటల నుంచి జిల్లా కలెక్టరు కార్యాలయంలో నిర్వహిస్తారని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ వివిధ శాఖలలో పని చేస్తున్న ఉద్యోగులు వారికి సంబంధించిన గ్రీవెన్స్ ఏమైనా ఉంటే వాటిని దరఖాస్తులో పొందుపర్చాలన్నారు.

నాడు-నేడులో వేగంగా నిర్మాణాలు

- రెండవ విడతలో 1,613 పాఠశాలల ఎంపిక
- రూ.200.10 కోట్లు విడుదల
- దాదాపు 90 శాతం పనులు పూర్తి



గుడివాకలంకలోని జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్మాణం పూర్తి చేసుకుంటున్న అదనపు తరగతి గదులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యారంగ అభివృద్ధి అంటే ఏమిటో ప్రపంచానికి తెలిసేలా అనేక పథకాలు అమలు చేస్తూ ఆ రంగం స్వరూపానే మార్చేశారు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, విద్యాకానుక, గోరుముద్ద ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో పథకాలు. వీటితో పాటు గత ప్రభుత్వాలు అసలు కన్నెత్తి చూడని మరో అంశాన్నీ ఆయన ప్రాధాన్యతాంశంగా పరిగణించారు. అదే పాఠశాలల అభివృద్ధి. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో చదువుకునే వాతావరణం కల్పించాలనే లక్ష్యంతో మన బడి నాడు - నేడు అనే కార్యక్రమం చేపట్టారు. రాష్ట్రంలో ఉన్న అన్ని పాఠశాలలనూ అభివృద్ధి చేయడమే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమం జగన్‌కు ముందు, జగన్ శకం అనేలా విద్యారంగ నిపుణులు కీర్తిస్తున్నారు.

నాడు – నేడు పనులు వేగవంతం

ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో మన బడి నాడు - నేడు పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఇప్పటికే నిర్ణీత గడువులోపు నాడు - నేడు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. రెండో విడత నాడు - నేడు కార్యక్రమంలో భాగంగా ఎంపికైన పాఠశాలల్లో పనులు పూర్తి చేసే కార్యక్రమంలో పాఠశాలల హెచ్‌ఎంలు, అధికారులు బిజీగా ఉన్నారు. రెండో విడతలో శ్లాబ్‌లు, పిల్లర్లు, టైల్స్ పనులు, చిన్న,పెద్ద మరమ్మతు పనులు, పై అంతస్తుకు శ్లాబ్ పనులు, ప్రహరీ గోడ పనులు ఇప్పటికే పూర్తి చేశారు. కొన్ని పాఠశాలల్లో విద్యుదీకరణ పనులు, గ్రీన్ చాక్‌బోర్డ్ పనులు, మరుగుదొడ్ల పనులు, విద్యార్థులకు మంచినీటి సౌకర్యాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు.

రెండో విడతలో 1,613 పాఠశాలల ఎంపిక

రెండో విడత నాడు – నేడు కార్యక్రమం కింద ఏలూరు జిల్లాలో 883 పాఠశాలలను ఎంపిక చేశారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 730 పాఠశాలలను ఎంపిక చేశారు. తొలి విడతలో ఎంపికైన పాఠశాలల కంటే రెండో విడతలో ఎంపికైన పాఠశాలల సంఖ్య 496 అధికంగా ఉంది. తొలి విడతలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రాతిపదికన 1117 పాఠశాలలను నాడు – నేడు కార్యక్రమం కింద అభివృద్ధి చేయడానికి ఎంపిక చేశారు. రెండో విడతలో సైతం ఎంపిక చేసిన పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం, తరగతి గదుల్లో విద్యార్థులకు సౌకర్యవంతంగా ట్యూబ్‌లైట్ల ఏర్పాటు, ఫ్యాన్లు ఏర్పాటు, పెయింటింగ్, క్రీడా ప్రాంగణాల అభివృద్ధి, ప్రహరీ గోడలపై పెయింటింగ్‌లు ఇలా అనేక పనులు నిర్వహించనున్నారు.

నిర్మాణ సామగ్రి సర్దుబాటు

వివిధ పాఠశాలల్లో జరుగుతున్న నాడు - నేడు పనుల్లో నిర్మాణ సామగ్రిని సర్దుబాటు చేసుకునే వెసులుబాటును కల్పించారు. వర్షాలు కురుస్తుండడం, నిర్మాణ కూలీలు అందుబాటులో లేకపోవడం తదితర కారణాలతో కొన్ని పాఠశాలల్లో నాడు - నేడు పనులు నిలుపుదల చేస్తే ఆయా పాఠశాలల వద్ద ఉన్న నిర్మాణ సామగ్రిని సమీప పాఠశాలలకు సర్దుబాటు చేసుకుంటున్నారు. దీంతో కొన్ని పాఠశాలల్లో నిధులు సకాలంలో విడుదల కాక నిర్మాణ సామగ్రి లేక నిలిచిపోయిన పనులు ఊపందుకుంటున్నాయి. ఆయా పాఠశాలలకు నిధులు విడుదలైన వెంటనే నిర్మాణ సామగ్రిని తిరిగి వారికి అందించేలా నిబంధనలను సరళతరం చేయడం ఉపయుక్తంగా ఉంటుందని ప్రధానోపాధ్యాయులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

రూ. 200.10 కోట్ల నిధులు విడుదల..

ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో నాడు – నేడు రెండో విడతకు మొత్తం రూ. 554.73 కోట్ల నిధులు మంజూరు చేసింది. కేటాయించిన నిధుల నుంచి ఏలూరు జిల్లాకు రూ. 95.62 కోట్లు, పశ్చిమ్లకు రూ. 104.48 కోట్లు విడుదల చేశారు.

నాడు-నేడులో అభివృద్ధి పనులు వేగవంతం



నాడు – నేడు పనులతో పాఠశాలల్లో అద్భుతమైన అభివృద్ధి జరుగుతోంది. ఆయా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన అంచనాలను మించి జరుగుతోంది. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పాఠశాలల అభివృద్ధి పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ పాఠశాలల అభివృద్ధికి ఈ స్థాయిలో నిధులు మంజూరు చేయలేదు. ఈ అభివృద్ధితో విద్యార్థుల్లో చదువుపట్ల ఆసక్తి పెరిగి సత్ఫలితాలు సాధించే అవకాశం ఉంటుంది.

– సబ్బితి నరసింహమూర్తి, మండల విద్యాశాఖాధికారి, పెదపాడు

సకాలంలో పూర్తి చేయకపోతే చర్యలు



జిల్లాలో నాడు – నేడు పనులకే తొలి ప్రాధాన్యత ఇస్తున్నాం. దాదాపుగా అన్ని పాఠశాలల్లో 80 నుంచి 90 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశాం. అక్కడక్కడా పనులు మందకొడిగా జరుగుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఈ వారంలోపు వారు పనులు పూర్తి చేయకపోతే షోకాజ్ నోటీసులు జారీ చేసి నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటాం.

– పి.శ్యామ్ సుందర్, ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి

పకడ్బందీగా జగనన్న సురక్ష క్యాంపులు

కలెక్టర్ ప్రశాంతి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ప్రశాంతి, అధికారులు

భీమవరం(ప్రకాశం చౌక్): జగనన్న సురక్ష క్యాంపుల నిర్వహణకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్షించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతానికి ఏర్పాట్లను పక్కాగా పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. సెప్టెంబర్ 30 నుంచి రాష్ట్రమంతటా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని 45 రోజుల పాటు నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. భీమవరం వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ పి.ప్రశాంతి, డీఎంహెఓ డి.మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల ఏర్పాటుకు ముందస్తుగా ఏర్పాట్లను పక్కాగా పూర్తి చేయాలన్నారు. 15 రోజులు సర్వే అనంతరం ఎంతమంది స్పెషలిస్ట్ డాక్టర్లు అవసరమో తెలుస్తుందన్నారు. ఇందుకు అనుగుణంగా డాక్టర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు ప్రారంభానికంటే ముందు మూడు దశల్లో కార్యక్రమాలు చేపట్టాలన్నారు. తొలి దశలో గృహ సారథులు స్థానిక ప్రజా ప్రతినిధులు ఇంటింటా ప్రచారం, రెండో దశలో ఏఎన్ఎం, సీహెచ్‌ఓలు ఇంటింటికి వెళ్లి వివరాలు నమోదు చేపట్టాలన్నారు. మూడో దశలో క్యాంపులు ప్రయోజనాలను వివరించడం, నాలుగో దశలో క్యాంపులు నిర్వహించడం చేయాలన్నారు.

ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేయాలి

క్యాంపులకు అవసరమైన భవనాలను ముందుగా గుర్తించాలన్నారు. స్కూలు ప్రాంగణమైతే ఆ రోజు ఆ స్కూలుకు సెలవు ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి క్యాంపులో నాలుగు రూంలు ఏర్పాటుచేసి జనరల్ కన్సల్టెన్సీ, చిల్డ్రన్ కన్సల్టెన్సీ, గైనిక్ కన్సల్టెన్సీ, టెలి కన్సల్టెన్సీ అనే నాలుగు విభాగాలను ఏర్పాటు చేయాలన్నారు. టాయిలెట్లు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. పాలిచ్చే పిల్లల తల్లులకు ఫీడింగ్ చాంబర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు క్యాంపుల ఏర్పాటు బాధ్యతలను తీసుకోవాలన్నారు. తాగునీటి ఏర్పాటుతోపాటు, క్యాంపుకు హాజరై చెకప్ చేయించుకునే వారికి భోజనం ఏర్పాటు చేయాలని సూచించారు. హెల్త్ క్యాంపు ప్రదేశాలలో పక్కాగా పారిశుధ్య ఏర్పాట్లు చేయడంతో పాటు, క్యాంపు నిర్వహించే రోజున శానిటరీ వర్కర్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. బయో మెడికల్ వేస్ట్‌ను ఎప్పటికప్పుడు శుభ్రపరిచి, సంబంధిత వెహికల్ అప్పగించాలన్నారు. కార్యక్రమం విజయవంతానికి సంబంధిత అధికారులు అందరూ కృషి చేయాలని కోరారు. డీఎంహెచ్‌ఓ డి.మహేశ్వరరావు, డీఎల్‌డీఓ కేసీహెచ్ అప్పారావు, డీఈఓ ఆర్.వెంకటరమణ, ఇన్‌చార్జ్ డీసీహెచ్‌ఎస్ పి.సూర్యనారాయణ, డీపీఓ జీవీకే మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లను ఉపేక్షించేది లేదు

ఉండి: అక్రమ లేఅవుట్లు ఎక్కడ ఉన్నా వాటిని ఎట్టి పరిస్థితుల్లోను ఉపేక్షించేది లేదని కలెక్టర్ పీ ప్రశాంతి అన్నారు. ఉండి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు ఆర్డీవో దాసి రాజు, జిల్లా అభివృద్ధి అధికారి కేసీహెచ్ అప్పారావు, జిల్లా పంచాయతీ అధికారి జీవీకే మల్లికార్జునరావు, డీఎస్పీ బీ శ్రీనాథ్‌లు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులు, దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా చదివి స్పష్టమైన పరిష్కారం చూపాలని ఆదేశించారు. అవసరమైతే క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి పరిశీలించి ఫిర్యాదుదారులతో మాట్లాడి పరిష్కరించాలన్నారు. ప్రజా సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అందులో భాగంగానే మండల స్థాయిలో ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఉండిలో గ్రీవెన్స్ కార్యక్రమానికి ప్రజల నుంచి 53 ఫిర్యాదులు స్వీకరించినట్లు తెలిపారు. వీటిలో ఉండి మండలం కోలమూరు గ్రామానికి చెందిన పేరిచర్ల రామరాజు తన భూమికి పట్టాదార్ పాస్‌పుస్తకం ఇప్పించాలని కోరారు. ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం గ్రామానికి చెందిన మేడిది సాయిజగన్నాథ్ దళిత శ్మశాన వాటికకు స్థలం మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఎస్వీఎస్ నాయుడు, ఎంపీడీవో ఏవీ అప్పారావు, ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణ రాజు, ఉండి సర్పంచ్ కమతం సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

15న మెడికల్ కాలేజీ ప్రారంభం

వర్చువల్‌గా ప్రారంభించనున్న సీఎం వైఎస్ జగన్



మెడికల్ కాలేజీ క్లాస్‌రూం పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి, చిత్రంలో ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్‌కుమార్

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల 15న నూతనంగా ఏర్పాటైన ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలను లాంఛనంగా ప్రారంభించి, ఎంబీబీఎస్ మొదటి ఏడాది విద్యార్థులను ఉద్దేశించి సందేశం ఇస్తారని జిల్లా జాయింట్ కలెక్టర్ బీ.లావణ్యవేణి తెలిపారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విజయనగరం నుంచి రాష్ట్రంలోని ఐదు నూతన ప్రభుత్వ వైద్య కళాశాలలను వర్చువల్‌గా ప్రారంభిస్తున్న తరుణంలో ఏర్పాట్లను జేసీ లావణ్యవేణి బుధవారం పరిశీలించారు. ఏలూరులోని నూతన వైద్య కళాశాలను వర్చువల్‌గా ప్రారంభిస్తూ వైద్య విద్యార్థులతో సీఎం ముఖాముఖి సంభాషించేలా ఏర్పాట్లు చేశామని జేసీ తెలిపారు. సీఎం కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నూతన ప్రభుత్వ వైద్య కళాశాలను నిర్ణీత సమయానికే పూర్తి చేసి ఆధునిక సౌకర్యాలతో అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. తొలి బ్యాచ్ వైద్య విద్యార్థులతో జేసీ లావణ్యవేణి కొద్దిసేపు ముచ్చటించారు. వైద్య కళాశాలలో సౌకర్యాలు, ల్యాబ్‌లు పరిశీలించారు. కొత్తగా అన్ని సౌకర్యాలు కల్పించామని మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కేవీవీ విజయ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఏలూరు ఆర్డీవో ఎస్‌కే ఖాజావలి, డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, ఏలూరు తహసీల్దార్ సోమశేఖర్, ఏపీఎంఎస్‌ఐడీసీ కోఆర్డినేటర్ సునీల్‌కుమార్, ఈఈ రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి

ఏలూరు టౌన్: స్థానిక కొత్తపేట డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అందరికీ ఆరోగ్యం అందించాలనే లక్ష్యంతో చేపట్టిన ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రాష్ట్రంలోని పేదవర్గాలకు అత్యుత్తమ స్థాయి వైద్య సేవలను అందించేందుకు ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్నాయని తెలిపారు. పేదలకు ఉత్తమ వైద్య సేవలు అందించాలనే గొప్ప సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని వైద్యరంగాన్ని సమూలంగా మార్పు చేశారని చెప్పారు. ప్రతి లబ్ధిదారుడూ హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులు తీసుకోవాలని సూచించారు. ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేసి సమగ్ర ఆరోగ్య వివరాలు సేకరిస్తారని, అనంతరం మెడికల్ క్యాంపులు నిర్వహిస్తారని వెల్లడించారు.

నైపుణ్యాల్ని మెరుగుపర్చుకోవాలి



భీమవరం డీఎన్నార్ కళాశాలలో జాబ్‌మేళాకు హాజరైన దివ్యాంగులతో కలెక్టర్ ప్రశాంతి తదితరులు

సాక్షి, భీమవరం: విద్యార్థులు చదువుతోపాటు నైపుణ్యాల్ని మెరుగుపరచుకుంటే ఉన్నత స్థానాలను అందిపుచ్చుకోచ్చునని కలెక్టర్ ప్రశాంతి అన్నారు. భీమవరం డీఎన్నార్ కళాశాలలో బుధవారం నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో నిర్వహించిన మెగా జాబ్ మేళా సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థులు ఎప్పటికప్పుడు సాఫ్ట్ స్కిల్స్, ప్రొఫెషనల్ స్కిల్స్‌లో నైపుణ్యాన్ని పొందాల్సిన అవసరం ఉందన్నారు. నిరుద్యోగుల కోసం రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఇలాంటి జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా భారీ స్థాయిలో జాబ్ మేళాను ఏర్పాటు చేసిన డీఎన్నార్ కళాశాల యాజమాన్యాన్ని కలెక్టర్ ప్రశాంతి అభినందించారు. కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు గోకరాజు వెంకట నర్సింహరాజు, గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు) మాట్లాడుతూ డీఎన్నార్ విద్యాసంస్థల్లో చదివిన విద్యార్థులతో పాటు ఇతర విద్యాసంస్థలో విద్యనభ్యసించిన విద్యార్థుల అర్హతల మేరకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం సామాజిక బాధ్యతగా భావించి జాబ్‌మేళాను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు మాట్లాడుతూ జాబ్‌మేళాకు సుమారు 22 కంపెనీల నుంచి ప్రతినిధులు హాజరుకాగా ఉద్యోగాల కోసం సుమారు 1,200 మంది విద్యార్థులు పేర్లు నమోదు చేసుకుని ఎంపిక ప్రక్రియలో పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎ.కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ బీఎస్ శాంతకుమారి, పాలకవర్గ సంయుక్త కార్యదర్శి కె.రామకృష్ణంరాజు, కోశాధికారి జీవీయస్‌ఆర్ నారాయణ, సహాయ కార్యదర్శి కొత్తపల్లి శివరామరాజు, ఎన్ రామలింగరాజు, సీహెచ్ దత్తాత్రేయవర్మ, పి.రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

పేటీఎం మెషీన్‌తో స్త్రీ నిధి రుణాల చెల్లింపు

భీమవరం(ప్రకాశం చౌక్): డ్వాక్రా మహిళలు స్త్రీ నిధి నుంచి తీసుకున్న రుణాలను ఇక నుంచి స్త్రీ నిధి మహిళా బ్యాంక్ ప్రారంభించిన పేటీఎం మెషీన్ ద్వారా చెల్లించాలని, దీనిని జిల్లాలో ప్రయోగాత్మకంగా ఉండి మండలంలో మొట్టమొదటి సారిగా అమలు చేస్తున్నామని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎంఎస్ఎస్ వేణుగోపాల్ తెలిపారు. జిల్లా డీఆర్‌డీఏ కార్యాలయంలో బుధవారం వీఏలకు, సీసీలకు పేటీఎం మెషీన్ పద్ధతిలో రుణాల చెల్లింపుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం స్త్రీ నిధి రుణాలు తీసుకున్న సభ్యులు రుణ వాయిదాలు స్వయం సహాయక సంఘాల లీడర్ల ద్వారా గ్రామ సమాఖ్యకు చెల్లిస్తున్నారు. ఆ ఖాతా నుంచి గ్రామ సంఘం అధ్యక్షుల ద్వారా వీఓఏ స్త్రీనిధి ఖాతాకు రుణాలు బదిలీ చేస్తున్నారు. ఈ మొత్తాలను, స్వయం సహాయక సంఘాలు చెల్లించిన వివరాలను వీఓఏ ద్వారా సీసీ తీసుకుని వారి లాగిన్‌లో సర్దుబాటు చేస్తారు. దీని వల్ల అనేక ఇబ్బందులు ఉన్నాయన్నారు. కొత్త విధానం ద్వారా రుణ వాయిదాలు సకాలంలో చెల్లించడం ద్వారా స్త్రీనిధి రుణం తీసుకున్న సభ్యులకు వడ్డీ సకాలంలో పడడం, రుణాలు నేరుగా జమకావడం జరుగుతుందన్నారు. ఈ పేటీఎం మెషీన్‌లో వీఓఏ తన మొబైల్ నెంబర్ ద్వారా లాగిన్ అయి తన గ్రామ సంఘంలోని స్త్రీనిధి రుణాలు తీసుకున్న సంఘ సభ్యుల సంఘం ఐడీ నెంబర్ నమోదు చేయగా స్త్రీనిధి రుణాల సభ్యుల వివరాలు చూపుతుందన్నారు.

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

ఆంధ్రప్రదేశ్
ANDHRA PRADESH
AP Pollution Control Board

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

శిబిరం చిరునామా:

పొట్టి శ్రీరాములు మున్సిపల్ గరల్స్ హైస్కూల్, నాచువారిసెంటర్, భీమవరం-1
తేది : 16-09-2023 (శనివారం)
సమయం : ఉ. 9.30 గం.ల నుంచి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన
ఫోన్ నంబరు : 9912440768

క్లుప్తంగా

సినీ స్టిల్ ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా వెంకట్రావు


వెంకట్రావు

భీమవరం (ప్రకాశం చౌక్): తెలుగు సినీ పరిశ్రమ స్టిల్ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా భీమవరానికి చెందిన గోపిశెట్టి వెంకట్రావు ఎన్నికయ్యారు. వెంకట్రావు గత 20 ఏళ్లుగా సినీ ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. గతంలో దర్శకరత్న దాసరి నారాయణరావు చేతుల మీదుగా ఉత్తమ ఫొటోగ్రాఫర్ అవార్డు అందుకున్నారు. వెంకట్రావుకు పలువురు ఫొటోగ్రాఫర్లు అభినందనలు తెలిపారు.

శ్రీవారి ట్రస్టుబోర్డు సభ్యుడిగా అఫిడవిట్ సమర్పణ


ఏఈఓ దుర్గారావుకు అఫిడవిట్‌ను అందజేస్తున్న రమేష్

ద్వారకాతిరుమల: శ్రీవారి దేవస్థానం ట్రస్టు బోర్డులోకి ప్రత్యేక ఆహ్వానితుడిగా నియమితులైన తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం ఘంటావారిగూడెంకు చెందిన తొమ్మండ్రు రమేష్ తన అఫిడవిట్‌ను బుధవారం ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావుకు అందజేశారు. ముందుగా ఆయన కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో ఏఈఓ దుర్గారావుకు తన అఫిడవిట్‌ను అందించారు. ఈఓ వేండ్ర త్రినాథరావు అందుబాటులో లేకపోవడంతో ఆయన సూచనల మేరకు ఏఈఓ దుర్గారావుకు అఫిడవిట్‌ను అందించినట్టు రమేష్ తెలిపారు. ఇకపై జరిగే దేవస్థానం పాలకవర్గ సమావేశాల్లో తాను సభ్యుడిగా పాల్గొంటానని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే ఇటీవల తన పదవికి రాజీనామా చేసిన తాడేపల్లిగూడెంకు చెందిన ఆలయ ట్రస్టు బోర్డు సభ్యుడు ముప్పిడి సంపత్ కుమార్ స్థానంలో, తూర్పుగోదావరి జిల్లా, కోరుకొండకు చెందిన ఎం.రామ్మోహన్ ప్రత్యేక ఆహ్వానితుడిగా నియమితులయ్యారు.

ముమ్మరంగా స్వామిత్వ రెండో దశ సర్వే


తాడేపల్లిగూడెం మండలం నందమూరులో ఓ ఇంటిని సర్వే చేస్తున్న సిబ్బంది


వేండ్రలో సర్వే కోసం కొలతలు తీసుకుంటున్న సిబ్బంది

భీమవరం (ప్రకాశం చౌక్): ఒక పక్క భూములను రీసర్వే చేస్తూ మరో వైపు గ్రామ కంఠాన్ని కూడా సర్వే చేయడానికి ప్రభుత్వం స్వామిత్వ (సర్వే ఆఫ్ విలేజ్ అండ్ మ్యాపింగ్ విత్ ఇంప్రువైజ్డ్ టెక్నాలజీ విలేజ్ ఏరియా) పథకం ప్రవేశపెట్టింది. గ్రామ కంఠ భూమి సర్వే ఇప్పటివరకు చేపట్టలేదు. ఈ నేపథ్యంలో మొట్టమొదటిసారిగా ప్రభుత్వం గ్రామ కంఠం భూములను సర్వే చేయిస్తోంది. స్వామిత్వ పథకంలో దశల వారీగా సర్వే చేస్తున్నారు. మొదటి దశలో జిల్లాలోని 16 మండలాల్లో 16 గ్రామాల్లో సర్వే పూర్తి చేసి హక్కు పత్రాలు కూడా అందజేశారు. సర్వే చేసిన వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో రికార్డులుగా భద్రపరుస్తున్నారు. ప్రసుత్తం రెండో దశ సర్వే జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా సాగుతోంది. గ్రామాల్లోని గ్రామ కంఠంలోని ఇళ్లను, ఖాళీ స్థలాలను సర్వే చేస్తున్నారు.

9 మండలాల్లో..

జిల్లా వ్యాప్తంగా స్వామిత్వ సర్వే రెండో దశలో 9 మండలాల్లో 14 గ్రామాల్లో సర్వే పనులు జరుగుతున్నాయి. రెండో దశ సర్వే లక్ష్యం 8,834 ఇళ్లు, స్థలాలు కాగా ఇప్పటివరకు 14 గ్రామాల్లో 7,043 ఇళ్లు, స్థలాలల్లో సర్వే పూర్తి చేశారు. ప్రతి గ్రామంలోని వీఆర్వో, సర్వేయర్, సెక్రటరీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్‌లను ఒక బృందంగా ఏర్పాటు చేసి సర్వే చేయిస్తున్నారు. వారికి ఎప్పటికప్పుడు సర్వే శిక్షణ, సలహాలు, సూచనలను ఉన్నతాధికారులు ఇస్తున్నారు. సర్వేలో ఆథరైజడ్ ఇమేజ్ మ్యాప్, రోవర్, తదితర ఆధునిక పరికరాలను వినియోగిస్తున్నారు.

ప్రయోజనాలు ఇవే

సర్వే చేయడం ద్వారా భూహద్దులు, భూవిస్తరణ, గ్రామ కంఠం భూమి వివరాలు వెలుగులోకి వస్తాయి. ఆక్రమణలో ఉన్న గ్రామ కంఠం భూమి, గ్రామాల్లో ఉన్న ఆలయ భూముల వివరాలు కూడా వెల్లడవుతాయి. సర్వే చేసిన ఇళ్లు, స్థలాలకు ప్రభుత్వం హక్కు పత్రాలు అందించడంతో పాటు సరైన హద్దులు, విస్తరణ ఉండడంతో భూవివాదాలు తొలగుతాయి.

మండలం	గ్రామం	టోటల్ ఎసెస్‌మెంట్స్	సర్వే పూర్తి
పాలకోడేరు	గొల్లలకోడేరు	2157	1590
పాలకోడేరు	వేండ్ర	1010	739
ఆకివీడు	అజ్జమూరు	450	385
కాళ్ల	కోపల్లె	970	690
పెంటపాడు	వల్లూరుపల్లి	530	470
ఉండి	వెలివర్రు	276	250
వీరవాసరం	బొబ్బనపల్లి	212	176
కాళ్ల	జక్కరం	650	500
అత్తిలి	కొమ్మర	671	558
వీరవాసరం	మడుగుపోలవరం	480	357
తాడేపల్లిగూడెం	నందమూరు	402	365
అత్తిలి	కంచుమర్రు	513	455
వీరవాసరం	పంజావేమవరం	360	325
గణపవరం	వెలగలపల్లి	153	153

సమస్యలుంటే ఫిర్యాదు చేయవచ్చు

సర్వేలో ఇళ్లు, స్థలానికి సంబంధించి ఏదైన సమస్య ఉంటే మండలంలోని సర్వే డీటీగా పని చేసే డిప్యూటి తహసీల్దార్‌లకు ఫిర్యాదు చేసి సమస్య పరిష్కరించుకోవచ్చు. అక్కడ కూడా సమస్య పరిష్కారం కాకపోతే తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసి సమస్య పరిష్కరం పొందవచ్చును.

హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

ప్రభుత్వం ఉచితంగా ఇళ్లు, స్థలాలను సర్వే చేసి సరైన కొలతలు, హద్దులు నిర్ధారించి హక్కు పత్రాలను అందించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సరిహద్దు వివాదాలకు ఈ సర్వే చెక్ పెడుతుందని అంటున్నారు. అమ్మకం, కొనుగోళ్లకు వీలుగా హక్కు పత్రాలు ఉపయోగపడేలా ఇవ్వడం బాగుందని అంటున్నారు.

రెండో దశ సర్వే జరుగుతున్న మండలాలు	:	9
సర్వే బృందాలు	:	14
సిబ్బంది	:	70
సర్వే డీటీలు	:	9
తహసీల్దార్లు	:	9

జిల్లాలో రెండో దశలో 14 గ్రామాల్లో సర్వే



జిల్లా వ్యాప్తంగా స్వామిత్వ రెండో దశలో 14 గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నారు. మొదటి దశలో 16 మండలాల్లోని 16 గ్రామాల్లో సర్వే పూర్తి చేశారు. సర్వే 14 గ్రామాల్లో వేగంగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటివరకూ 7,043 ఎసెస్మెంట్ సర్వే పూర్తయ్యింది.

– జీవీకే మల్లికార్జునరావు, జిల్లా పంచాయతీ అధికారి

ఫెన్సింగ్ పోటీల్లో పశ్చిమకు పతకాల పంట


ఫెన్సింగ్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: కాకినాడ జిల్లా పరిషత్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన 5వ ఏపీ రాష్ట్ర స్థాయి చైల్డ్ (అండర్-10), 8వ రాష్ట్ర స్థాయి మినీ (అండర్-12) ఫెన్సింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు వ్యక్తిగత, టీమ్ ఈవెంట్స్‌లో ప్రతిభ చూపి అనేక పతకాలు సాధించారని ఫెన్సింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జీవీఎస్ కృష్ణమోహన్ చెప్పారు. బుధవారం పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించిన సందర్భంగా ఆయన విలేకరులకు వివరాలను వెల్లడించారు. అండర్-12 వ్యక్తిగత ఫోయిల్ బాలికల విభాగంలో మంతెన సమీక్ష బంగారు, నంబూరి శ్రేష్ఠ కాంస్య పతకాలు సాధించారన్నారు. ఈపీ బాలుర విభాగంలో బి.శశికార్తీక్‌వర్మ బంగారు పతకం, సేబర్ బాయ్స్ విభాగంలో జె కాశీఅభినవ్ రజత పతకం పొందారన్నారు. టీమ్ ఫోయిల్ బాలికల విభాగంలో మంతెన సమీక్ష, నంబూరి శ్రేష్ఠ, దాట్ల సాహ బంగారు పతకాలు సాధించగా ఫోయిల్ బాలుర విభాగంలో డి.వర్షిత్‌రంగవర్మ, డి.శాశ్విన్, యు.అనీష్ కార్తీక వర్మ బంగారు పతకాలు గెల్చుకున్నారన్నారు. అలాగే అండర్-10 వ్యక్తిగత ఈపీ బాలికల విభాగంలో ఎ.ఇషాన్వి రజత పతకం, ఫోయిల్ బాలుర విభాగంలో వి.సూర్యరామకృష్ణరాజు రజత, యు.అనీష్ కృతిక్‌వర్మ కాంస్య పతకాలు సాధించారన్నారు. ఈపీ బాయ్స్ విభాగంలో ఐ.అహాన్‌వర్మ బంగారు, సేబర్ బాయ్స్ విభాగంలో పీఎస్ఎస్ఎస్ అయాన్ష్ రజత పతకం సాధించినట్లు కృష్ణమోహన్ వివరించారు.

ట్రాక్టర్ డ్రైవర్‌కు జైలు శిక్ష

నూజివీడు: ట్రాక్టర్‌ను నిర్లక్ష్యంగా నడిపి వ్యక్తి మృతికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్ చొప్పా నాగరాజుకు 15 రోజుల జైలుశిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టు స్పెషల్ మెజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు కృష్ణాజిల్లా బాపులపాడు మండలం కానుమోలు కు చెందిన సాధనాల శ్రీనివాసరావు, మామిడి సత్తిబాబు రైస్‌మిల్ ఓనర్ పవన్‌కుమార్ ఆదేశానుసారం 2019 జూన్ 16న ఉదయం కానుమోలు నుంచి హనుమాన్ జంక్షన్‌కు ట్రాక్టర్‌పై వెళ్లారు. అక్కడ ఎయిర్ కంప్రెషర్ కొనుగోలు చేసి తిరిగి ట్రాక్టర్‌లో తిరిగి వస్తుండగా పెరికీడు సమీపంలోని పెట్రోలు బంకు వద్ద ట్రాక్టర్ ప్రమాదానికి గురై వెనుక ట్రాలీలో కూర్చున్న సాదనాల శ్రీనివాసరావు, మామిడి సత్తిబాబు కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో శ్రీనివాసరావు తీవ్ర గాయాలతో మృతి చెందగా, సత్తిబాబు స్వల్ప గాయాలతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. ట్రాక్టర్ డ్రైవర్ చొప్పా నాగరాజుపై హనుమాన్ జంక్షన్ పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు పూర్వపరాలు విచారించిన తరువాత నిందితుడు నాగరాజుకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

గడపగడపకు సంక్షేమం


పెంటపాడు: రావిపాడులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ వ్యక్తి కుటుంబానికి సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ


యలమంచిలి: దొడ్డిపట్లలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వృద్ధుడికి బ్రోచర్‌ను అందజేస్తున్న వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు

దోపిడీ ముఠా కోసం ముమ్మర గాలింపు


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ రవిప్రకాష్


ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం సభ్యులు

- తణుకులో బంగారం దోపిడీ కేసు ఛేదనకు ప్రత్యేక బృందాలు
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ రవిప్రకాష్
- ఘటన జరిగిన కొద్దిసేపటికే ఉంగుటూరు టోల్‌గేట్ దాటిన నిందితులు
- బాధితుడు నామ్‌దేవ్ సెల్‌ఫోన్‌కు టోల్‌గేట్ నుంచి వచ్చిన మెసేజ్‌తో అప్రమత్తమైన పోలీసులు

తణుకు: పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే ప్రధాన కూడలి నరేంద్ర సెంటర్‌లో వ్యాపారి ఇంట్లో బంగారం దోపిడీ ఘటనతో తణుకువాసులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. మంగళవారం రాత్రి పొద్దుపోకముందే జరిగిన ఈ ఘటనతో పోలీసు శాఖ అప్రమత్తమైంది. దుండగులను పట్టుకునేందుకు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. చోరీ అనంతరం దుండగులు మహారాష్ట్రకు పారిపోయినట్లుగా ప్రాథమిక నిర్ధారణకు వచ్చిన పోలీసులు ఆ దిశగా దర్యాప్తును వేగవంతం చేశారు. బుధవారం తణుకు విచ్చేసిన జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించిన బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్లూస్ టీం ఘటనా స్థలంలో ఆధారాలు సేకరించే ప్రయత్నం చేశారు.

ప్రధాన నిందితుడు సూరజ్?

మహారాష్ట్రలోని షోలాపూర్ నుంచి వలస వచ్చిన నామ్‌దేవ్, భార్య ముగ్గురు పిల్లలతో తణుకులో స్థిరపడ్డారు. స్థానిక నరేంద్ర సెంటర్‌లో రేణుక జ్యూయలరీ పేరుతో షాపు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే మహారాష్ట్రలోని తన సమీప బంధువైన సూరజ్‌కుంబార్‌ను మూడేళ్ల క్రితం తనకు చేదోడువాదోడుగా తెచ్చుకున్నారు. నామ్‌దేవ్ నివాసం ఉంటున్న పోర్షన్ పైఅంతస్తులో సూరజ్ నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో బంగారం తాకట్టు పెట్టుకుని డబ్బులు ఇస్తూ ఉండటం గమనించిన సూరజ్‌కు దుర్బుద్ధి పుట్టింది. దీంతో నలుగురు స్నేహితుల సాయంతో ఎలాగైనా బంగారం కాజేయాలని ప్రణాళిక చేశాడు. దీంతో మంగళవారం రాత్రి సుమారు 7.30 గంటల ప్రాంతంలో ఇద్దరు పిల్లలు ట్యూషన్‌కు వెళ్లాక అయిదుగురు కలిసి నామ్‌దేవ్ ఇంట్లోకి చొరబడి నామ్‌దేవ్, భార్య సవిత చిన్నకుమారుడు చేతన్‌లను బంధించి కత్తులతో బెదిరించి కొట్టి లాకర్ తాళాలు తీసుకుని మొత్తం బంగారంతోపాటు సవిత మెడలోని బంగారం సైతం అపహరించుకుపోయారు. కొద్ది సేపటికి తేరుకున్నాక పోలీసులకు సమాచారం అందడంతో తాడేపల్లిగూడెం డీఎస్పీ శరత్‌రాజ్‌కుమార్, తణుకు సీఐ ఆంజనేయులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

కారు స్వాధీనం

బంగారం స్వాధీనం చేసుకున్న నిందితులు వెళుతూ నామ్‌దేవ్‌కు చెందిన కారు తాళాలు తీసుకుని కారుపై పరారయ్యారు. ఘటన జరిగిన కొద్దిసేపటికి కారు ఉంగుటూరు టోల్‌గేటు దాటిన విషయం నామ్‌దేవ్ సెల్‌ఫోన్‌కు మెసేజ్ రావడంతో అప్రమత్తమైన పోలీసులు వెంబడించారు. అయితే భీమడోలు సమీపంలో కారు వదిలి పరారైనట్లు తెలుస్తోంది. అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా విజయవాడ చేరుకుని అక్కడి నుంచి మహారాష్ట్ర వెళ్లినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. అయితే సూరజ్‌కు సహకరించిన నలుగురు వ్యక్తులు హిందీ మాట్లాడినట్లుగా బాధితులు చెబుతుండటంతో మహారాష్ట్ర నుంచి వచ్చినట్లుగా అనుమానిస్తున్నారు. రెండ్రోజుల క్రితమే తణుకు వచ్చిన వీరు సూరజ్ ఉంటున్న గదిలోనే ఉన్నట్లుగా తెలుస్తోంది. దీన్నిబట్టి ప్రణాళిక ప్రకారమే ఈ దోపిడీ జరిగినట్లుగా పోలీసులు చెబుతున్నారు. ఈ ఘటనపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేయగా తాడేపల్లిగూడెం డీఎస్పీ శరత్‌రాజ్‌కుమార్ పర్యవేక్షిస్తున్నారు. సీసీ పుటేజీ ఆధారంగా పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు.

నాణ్యమైన పొగాకు పండించాలి


జంగారెడ్డిగూడెంలో పొగాకు నారుమడిని పరిశీలిస్తున్న పొగాకు బోర్డు ఎక్స్‌టెన్షన్ మేనేజర్ జి.దామోదర్

జంగారెడ్డిగూడెం: రైతులందరూ బయో పెస్టిసైడ్స్ వాడి నాణ్యమైన పొగాకును పండించాలని పొగాకు బోర్డు ఎక్స్‌టెన్షన్ మేనేజర్ జి.దామోదర్ అన్నారు. బుధవారం జంగారెడ్డిగూడెం-1 వేలం కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా దామోదర్ మాట్లాడుతూ బయో పెస్టిసైడ్స్ వాడకం ద్వారా నాణ్యమైన పొగాకును ఉత్పత్తి చేయాలని సూచించారు. సీటీఆర్ఐ శాస్త్రవేత్తలు నిర్ధారించిన వంగడాలు మాత్రమే వినియోగించాలన్నారు. ప్రస్తుత ఏడాది వేలం ఆశాజనకంగా సాగడంతో రైతులు అధిక పంట పండించేందుకు ఆసక్తితో ఉన్నారని, అయితే బోర్డు సూచించిన మేర రాబోయే సీజన్‌కు బ్యారన్‌కు 35 క్వింటాల్ మాత్రమే పండించాలన్నారు. అనుమతికి మించి పొగాకు పండించినా, అనధికార బ్యారన్‌లు నిర్మించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పొగాకు రైతులకు బయో పెస్టిసైడ్ ట్రికోడర్మా, సుడోమొనస్ మందులను దామోదర్ పంపిణీ చేశారు. పొగాకు నారు పెంచడానికి వాడే ట్రేల నాణ్యతను పరిశీలించారు. జంగారెడ్డిగూడెంలో మానికల నాగేశ్వరరావు వ్యవసాయ క్షేత్రంలో పొగాకు నారుమడులు పరిశీలించారు. కార్యక్రమంలో వేలం కేంద్రం అధికారి బి.శ్రీహరి, ఎస్‌జీవో కె.సుధీర్, రైతులు కూచిపూడి రమేష్, జి.మురళి, మానికల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ ఎస్సై సాగర్‌బాబు సస్పెన్షన్

- ఉన్నతాధికారుల సంతకాల ఫోర్జరీ కేసులో ప్రాథమికంగా నిర్ధారణ
- గతంలో జంగారెడ్డిగూడెంలో ఎస్సైగా విధులు
- ఇటీవల వీఆర్‌కు బదిలీ..

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): అధికారుల సంతకాల ఫోర్జరీ, విధుల్లో పూర్తి నిర్లక్ష్యం, శాఖాపరంగా నిర్వహించాల్సిన కేసులను పట్టించుకోకపోవడం తదితర కారణాలతో ఎస్సై ఎం.సాగర్‌బాబును ఉన్నతాధికారులు సస్పెండ్ చేసినట్లు తెలిసింది. గతంలో జంగారెడ్డిగూడెంలో ఎస్సైగా విధులు నిర్వర్తించి ఇటీవల బదిలీల్లో భాగంగా సాగర్‌బాబును వీఆర్‌లో ఉంచారు. అనంతరం అతనిపై సస్పెన్షన్ వేటు వేస్తూ మూడు రోజుల క్రితమే ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. అధికారుల సంతకాలు ఫోర్జరీ వ్యవహారం వెలుగులోకి రావడంతో ఏలూరు జిల్లా పోలీస్ శాఖలో కలకలం రేగింది. సాగర్‌బాబు రెండేళ్ల క్రితం జంగారెడ్డిగూడెం ఎస్సైగా విధుల్లో చేరారు. ఈ క్రమంలో జంగారెడ్డిగూడెంలోని ఓ ప్రైవేటు విద్యాసంస్థకు సంబంధించి బిల్డింగ్ యజమానికి, విద్యాసంస్థల యాజమాన్యానికి వివాదం నెలకొంది. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదులను పట్టించుకోకపోవడం, భవనంలో పెట్రోలు పోసి తగలపెట్టే యత్నం చేసినా స్పందించకపోవడం, విధుల పట్ల పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించారు. అంతేకాక మహిళ అదృశ్యం కేసుకు సంబంధించి దర్యాప్తు సక్రమంగా చేయకపోవడం, రేషన్ డీలర్ నుంచి డబ్బులు డిమాండ్ చేసినట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి.

ప్రాథమిక విచారణలో నిర్ధారణ

వీటన్నింటి కంటే ప్రధానంగా ఉన్నతాధికారి సంతకం ఫోర్జరీ చేశారని ప్రాథమిక విచారణలో నిర్ధారించి సాగర్‌బాబును సస్పెండ్ చేయడంతో పాటు సమగ్ర విచారణ నిర్వహిస్తున్నారు. పూర్తి విచారణ అనంతరం తదుపరి చర్యలు తీసుకోనున్నారు. సాధారణంగా పోలీసు శాఖలో ఏసీఆర్ నివేదిక ఆధారంగానే పదోన్నతి కల్పిస్తారు. గతంలో సాగర్‌బాబు రాజమండ్రి జిల్లాలో పనిచేసిన సమయంలో అక్కడ డీఎస్పీగా పనిచేసిన అధికారి ప్రస్తుతం ఏఎస్పీగా విధులు నిర్వహిస్తున్నారు. డీఎస్పీ సంతకాన్ని ఒక కానిస్టేబుల్ సాయంతో సాగర్‌బాబు ఫోర్జరీ చేసి అప్పటి ఎస్పీకి పంపారు. అయితే రికార్డుల పరిశీలనలో సంతకం తేడా ఉండటాన్ని గుర్తించి ఆరా తీయడంతో ఫోర్జరీ విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై ప్రాథమిక దర్యాప్తు నిర్వహించగా ఫోర్జరీ చేసినట్లు నిర్ధారించి సాగర్‌బాబును ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు.

ఎస్పీ నేతృత్వంలో విచారణ

ఏలూరు ఎస్పీ మేరి ప్రశాంతి నేతృత్వంలో ఎస్సై సాగర్‌బాబుపై పూర్తి స్థాయి విచారణ చేపడతాం. ఉన్నతాధికారి సంతకం ఫోర్జరీ చేసినట్లు ప్రాథమికంగా నిర్ధారించాం. గతంలో సాగర్‌బాబు పనిచేసిన పోలీస్‌స్టేషన్‌లలో వివరాలు అన్నింటిని సమగ్రంగా పరిశీలించి తుది నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటాం.

– జీవీజీ అశోక్‌కుమార్, ఏలూరు రేంజ్ డీఐజీ

గోదావరిలో పడి వ్యక్తి మృతి

యలమంచిలి: గోదావరి రెయిలింగ్ మీద కూర్చుని ప్రమాదవశాత్తు నదిలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై జాజుల విజయ్ నాగప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చించినాడ గ్రామానికి బత్తుల ప్రభాకరరావు (46) మంగళవారం సాయంత్రం చించినాడ వశిష్ట గోదావరి నది వంతెన మీదకు వెళ్లాడు. రెయిలింగ్ మీద కూర్చుని ప్రమాదవశాత్తు గోదావరిలో పడిపోయాడు. అతని కోసం గాలించగా నిర్మాణంలో ఉన్న రైల్వే వంతెన వద్ద బుధవారం మృతదేహం దొరకడంతో అతని కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహానికి శవపంచనామా, పోస్టుమార్టం పూర్తి చేసి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్సై ప్రసాద్ వివరించారు.

క్లుప్తంగా

వలంటీర్ ఇంటర్వ్యూలకు 12మంది హాజరు



అర్జీదారులను ఇంటర్వ్యూ చేస్తున్న ఎంపీడీవో ఎం.విశ్వనాథ్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని బంగారుగూడెం, కొమ్ముగూడెం, కుంచనపల్లి, కృష్ణాయపాలెం, జగన్నాథపురం గ్రామాల్లో ఖాళీగా ఉన్న 10 వలంటీర్ పోస్టులకు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. పది వలంటీర్ పోస్టులకు 12మంది అభ్యర్థులు హాజరైనట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు గురువారం నియామక పత్రాన్ని అందించనున్నట్టు తెలిపారు. 15న శిక్షణ, 16న విధులకు హాజరు కావలసి ఉంటుందన్నారు.

నాడు-నేడు పనుల పురోగతిని ఆన్‌లైన్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో-2 జ్యోతి, పాల్గొన్న ప్రధానోపాధ్యాయులు

తాడేపల్లిగూడెం రూరల్: నాడు-నేడు పనుల పురోగతిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలని మండల విద్యాశాఖాధికారి-2 పీఎంకే.జ్యోతి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నాడు-నేడు ఫేజ్-2 పనుల పరోగతిపై ప్రధానోపాధ్యాయులు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. తద్వారా ఆడిట్ సమయంలో ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. పీఆర్ డీఈ వీఎస్.వేణుగోపాల్, పీఆర్ ఇన్‌చార్జ్ ఏఈ ప్రసాద్, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

జాతీయ యోగా కోచ్‌గా కరిబండి రామకృష్ణ ఉత్తీర్ణత



కరిబండి రామకృష్ణను అభినందిస్తున్న జయదీప్ ఆర్య

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెంకు చెందిన ఆరా ఫౌండేషన్ ఫౌండర్ ఛైర్మన్ కరిబండి రామకృష్ణ నేషనల్ యోగా కోచ్‌గా ఉత్తీర్ణత సాధించారు. ఇటీవల యోగాసన భారత్ ఆధ్వర్యంలో (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా) అనుసంధానంతో దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలనుంచి, విదేశీయులకు మొదటి యోగా కోచ్‌ల శిక్షణ పంజాబ్‌లోని పాటియాలాలో నిర్వహించగా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ తరుపున హాజరైన రామకృష్ణ ఉత్తీర్ణత సాధించారు. యోగాసన భారత్ జనరల్ సెక్రటరీ జయదీప్ ఆర్య, పట్టణానికి చెందిన యోగా గురువులు, యోగా సభ్యులు కరిబండి రామకృష్ణను అభినందించారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన



క్లబ్ సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం దత్

అత్తిలి: వస్తువులు కొనుగోలు చేసే ప్రతి వినియోగదారుడు వస్తువుల నాణ్యత, ధరలను చూసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దత్ చెప్పారు. బుధవారం అత్తిలి మండలం బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో వినియోగదారుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన హెచ్‌ఎం దత్ మాట్లాడుతూ మందులు కొనేసమయంలో గడువుతేదీని, ఖరీదు చూసి కొనుగోలు చేయాలన్నారు. ట్రైనీ ఉపాధ్యాయుడు జి శ్రీనివాసరావు కన్స్యూమర్స్ క్లబ్ నిర్మాణం, విధులు, వినియోగదారుల హక్కులు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్ పురుషోత్తం, నాగేశ్వరరావు, హర్షద్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

తణుకు టౌన్: విద్యార్థులు మద్యం, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి ఏకాగ్రతతో విద్యనభ్యసించాలని మానసిక వైద్యురాలు కన్నా కోమల చెప్పారు. అంతర్జాతీయ ఆత్మహత్యల నివారణ వారోత్సవాల్లో భాగంగా తణుకులోని మారుతీ డిగ్రీ కళాశాలలో డీఎంహెచ్‌పీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆత్మహత్యలకు దారితీస్తున్న పరిస్థితులు, మానసిక స్థైర్యంతో వాటిని ఎదుర్కోవాల్సిన తీరుతెన్నులపై అవగాహన కల్పించారు. సైకాలజిస్ట్ కె శ్రీనివాసరావు, కళాశాల ప్రిన్సిపాల్ కనకయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

పారదర్శక పాలన సీఎం జగనన్నతోనే సాధ్యం

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- రావిపాడులో గడపగడపకు మన ప్రభుత్వం
- సొసైటీ గిడ్డంగి భవనం ప్రారంభం

పెంటపాడు: రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి ప్రత్యేక లబ్ధి చేకూర్చాలన్న ధ్యేయంతో సీఎం వైఎస్ జగనన్న పారదర్శక పాలన అందిస్తున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రావిపాడులో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న పథకాలను వివరించారు. ప్రతి వ్యక్తికి ప్రభుత్వం ద్వారా పథకాలు సరిగా అందుతున్నాయా అని ఆరా తీసారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అధికారం అడ్డుపెట్టుకొని టీడీపీ అధినేత చంద్రబాబు భారీ కుంభకోణాలకు పాల్పడ్డారని విమర్శించారు. చంద్రబాబు అరెస్టు వెనుక ప్రభుత్వం తొందరపాటు, ప్రతీకారం, కక్ష వంటివి లేవన్నారు. ప్రజల పక్షాన ఉంటానన్న జనసేన నేత పవన్ ప్రస్తుతం చంద్రబాబు పక్షాన నిలబడి ఆయన అరెస్టును ఖండించడం సిగ్గుచేటన్నారు. సీఎం జగనన్న పాదయాత్రలో ఇచ్చిన హామీలు నూరుశాతం అమలుచేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు.



రావిపాడులో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

రూ. 45 లక్షలతో సొసైటీ గిడ్డంగి భవనం ప్రారంభం

రావిపాడు గడపగడప కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కొట్టు సత్యనారాయణ గ్రామ సొసైటీ గిడ్డంగి భవనాన్ని నాబార్డు నిధులతో నిర్మించిన భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సొసైటీల అధ్యక్షుడు దేవ వెంకటరమణ, సర్పంచ్ ఛాంబర్ అధ్యక్షుడు పెన్నాడ సూరిబాబు, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పులూరి వరలక్ష్మి, ఎంపీపీ దాసరి హైమావతి, పార్టీ అధ్యక్షుడు కై గాల శ్రీనివాస్, బూరాడ శ్రీనివాస్, కొట్టు విశాల్, కుంచే సుబ్రహ్మణ్యం, కోరిమిల్లి సొసైటీ అధ్యక్షుడు చుండూరి సర్వేశ్వరరావు, పార్టీ నాయకులు ములగాల బాబ్జి, దాట్ల సత్య రామలింగరాజు, వింజమూరి శ్రీనివాస్, ఎంపీటీసీ బొచ్చెల తాతారావు, ఎస్సీ నాయకులు డెక్కపాటి వెంకటరమణ, భట్టు భరతాంజనేయులు, పెన్నాడ రాఘవ, కైగాల గణపతి కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపదరావు కృష్ణారావు, అడ్వకేట్ హరిదాసు రవీంద్ర, ములగాల బాబ్జి, పసల చంటి, పూడి శ్రీనివాస్, చల్లా కుమారస్వామి, దేవరశెట్టి రాంబాబు, పాలా గణపతి, రెడ్డి సూరిబాబు, చింతపల్లి శ్రీనివాస్, కొండేపాడు సర్పంచ్ కట్టా దానయ్య, చల్లా లింగమూర్తి, పలు గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మంత్రి కొట్టు సత్యనారాయణకు గ్రామస్తులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. పలువురు మంత్రిని ఘనంగా సన్మానించి మహిళలు హారతులు పట్టారు.



రావిపాడులో సొసైటీ గిడ్డంగి భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

నేడు అలంపురంలో గడపగడపకు మన ప్రభుత్వం

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పెంటపాడు మండలం అలంపురంలో గురువారం సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్నట్టు పార్టీ అధ్యక్షుడు కై గాల శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, అధికారులు విధిగా పాల్గొనాలని ఆయన కోరారు.

బుల్లియ్యరెడ్డికి అభినందనలు



కొవ్వూరి బుల్లియ్య రెడ్డి(ఫైల్)

ఇరగవరం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఐటీ విభాగ కమిటీలో సెక్రటరీగా ఇరగవరం మండలం ఏలేటిపాడు గ్రామానికి చెందిన కొవ్వూరి బుల్లియ్య రెడ్డి(నానిరెడ్డి) నియామకం కావడంపై పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ స్థాపించిన మొదటి నుంచి నానిరెడ్డి పార్టీకి సేవలందించారు. తనను ఐటీ విభాగం కమిటీలో సెక్రటరీగా నియమించడంపట్ల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఐటీ విభాగం అధ్యక్షుడు సునీల్‌కుమార్‌రెడ్డి, పోసిమ్‌రెడ్డికి బుల్లియ్యరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు బుల్లియ్యరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

రేపు అలంపురంలో చేపల చెరువుల వేలం

పెంటపాడు: మండలంలోని అలంపురంలో ఈనెల 15న ఉదయం 10 గంటలకు బంగార్రాజు, చందాల, బాపన్న చెరువులను మూడేళ్లకు లీజుకు ఇచ్చేందుకు వేలంపాట నిర్వహించనున్నట్లు సర్పంచ్ తాతపూడి ప్రగతి, కార్యదర్శి బేగ్ తెలిపారు. వీటితోపాటు చెరువుగట్టుపై కొబ్బరి చెట్ల నుంచి మూడేళ్లు ఫలసాయం పొందేందుకు వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న పాటదారులు శుక్రవారం ఉదయం సంబంధిత ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

దోమ కాటు నుంచి ప్రజారోగ్యాన్ని పరిరక్షిద్దాం

తాడేపల్లిగూడెం (టీఓసీ): దోమకాటు నుంచి ప్రజారోగ్యాన్ని పరిరక్షిద్దామని మలేరియా డిపార్ట్‌మెంట్ తాడేపల్లిగూడెం సబ్ యూనిట్ అధికారి వైవీ లక్ష్మణరావు పిలుపునిచ్చారు. డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాల్లో భాగంగా హౌసింగ్ బోర్డులోని 34, 35 వార్డుల్లో హెల్త్ సిబ్బందితో క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణ కోసం వైద్య ఉద్యోగులు క్షేత్రస్థాయిలో బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రజల్ని వ్యాధుల బారి నుంచి రక్షించాలని ఆ దిశగా కృషి చేద్దామని సిబ్బందికి అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రం చేసేందుకు సమష్టి కృషి అవసరమని, అందరూ సహకరించాలని ర్యాలీలు నిర్వహించారు. మలేరియా, డెంగీ వ్యాధుల నుంచి రక్షణ కోసం దోమ లార్వా దశలోనే కొనుగొని వాటిని నాశనం చేయాలన్నారు. సిబ్బంది సాంకేతికంగా ముందు ఉండాలని, ఇళ్లల్లోని నీటిని నిల్వ చేసే కంటైనర్లు, ఓవర్ హెడ్ ట్యాంక్స్, ఫ్రిజ్‌లు, కూలర్లను విధిగా పరిశీలించి శుభ్రం చేయాలన్నారు. జ్వరం కేసులకు ప్రాథమిక పరీక్షలు ఉచితంగా అన్ని హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాల్లో అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. వార్డు ఆరోగ్య కార్యదర్శులు రాజేశ్వరీ, వెంకటలక్ష్మి, సహాయకులు కాంతారావు, శ్యాంబాబు, ఆశా కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.



హౌసింగ్ బోర్డు కాలనీలో హెల్త్ సిబ్బంది ర్యాలీ

జాతీయస్థాయి యోగా పోటీలకు విద్యార్థుల ఎంపిక

తాడేపల్లిగూడెం (టీఓసీ): జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికై న జిల్లా యోగ విద్యార్థులను బుధవారం పట్టణంలో సోమసాయి ఏజెన్సీలో నిర్వహించిన సమావేశంలో జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్‌ఏఆర్‌కే వర్మ, జిల్లా సెక్రటరీ ఎస్.ఎస్.చంద్రశేఖర్, కోచ్‌లు అభినందించారు. ఇటీవల రాష్ట్ర స్థాయి 48వ యోగాసనాల పోటీలు కర్నూలులో నిర్వహించారు. ఉమెన్స్ విభాగానికి సంబంధించి వివిధ కేటగిరిలలో వైఎస్ఆర్ హార్టీ కల్చర్ యూనివర్సిటీ విద్యార్థిని సుధారాణి గోల్డ్ మెడల్ సాధించగా, భారతీయ విద్యాభవన్స్ నుంచి విద్యార్థిని భవాని చౌదరి గోల్డ్ మెడల్ సాధించారు. భవన్స్ నుంచే ఎస్.తస్లిమా సిల్వర్ మెడల్ సాధించగా, తణుకు ఉమెన్స్ కళాశాల నుంచి ఏ.కార్తీక రజత పతకం సాధించారు. బాలురు విభాగంలో భవన్స్ నుంచి సీహెచ్ దీపక్ రెడ్డి, ఆదిత్య వర్మ రజత పతకంతో విజయకేతనం ఎగరవేశారు. గెలుపొందిన క్రీడాకారులు నవంబర్ 23 నుంచి 26 వరకు మన రాష్ట్రం తరుపున అస్సాంలోని గౌహతిలో నిర్వహించే జాతీయస్థాయి యోగా పోటీల్లో పాల్గొంటారని, ఈ సందర్భంగా అసోసియేషన్ నిర్వాహకులు విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న సీహెచ్‌ఏఆర్‌కే వర్మ, చంద్రశేఖర్, కోచ్ తదితరులు

అత్యధిక సభ్యత్వాలతో ఎంప్లాయీస్ యూనియన్

తణుకు అర్బన్: ఏపీపీటీడీ (ఆర్టీసీ)లో అత్యధిక సభ్యతాలు కలిగిన యూనియన్‌గా ఎంప్లాయీస్ యూనియన్ నిలిచిందని రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎండీ ఆలీ, డిపో కార్యదర్శి టీవీ శ్రీనివాస్ తెలిపారు. తణుకు ఆర్టీసీ గ్యారేజ్‌లో బుధవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో వారు ఈ విషయాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఆర్టీసీ ఎండీ, ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులకు తణుకు డిపో యూనియన్ తరపున కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం డిపో మేనేజరు పీఎస్‌వీఎం సత్యనారాయణమూర్తిని కలిసి మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు, గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.



తణుకులో డిపో మేనేజరు సత్యనారాయణమూర్తిని కలిసిన ఎంప్లాయీస్ యూనియన్ ప్రతినిధులు

ఆపదలో ఉన్నవారికి అండగా సీఎం జగన్

భీమవరం అర్బన్: నిరాధరణకు గురవుతోన్న వృద్ధులు, ఒంటరి మహిళలు, వికలాంగులకు, డయాలసిస్ బాధితులకు, ఆపదలో ఉన్నవారికి పింఛన్ ఇచ్చి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉంటున్నారని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు అల్లూరి కృష్ణంరాజు అన్నారు. భీమవరం మండలం వెంప గ్రామంలో బుధవారం ఆయన కొత్త పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణంరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వాల్లో నూతనంగా పింఛన్ కోసం మండలాఫీసులు చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా వచ్చేవి కావన్నారు. సీఎం జగనన్న ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా పింఛన్లు అందిస్తోందని చెప్పారు. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అర్హులందరికీ పింఛన్లు అందేలా చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. ఎమ్మెల్యే శ్రీనివాస్ సారథ్యంలో నియోజకవర్గం అభివృద్ధిలో పరుగులు పెడుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు సానబోయిన సత్యనారాయణ, సర్పంచ్ ఇంజేటి రాజేశ్వరి, సొసైటీ త్రిసభ్య కమిటీ ఛైర్మన్ కలిదిండి మురళీకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.



వెంపలో కొత్త పింఛన్లు అందిస్తున్న పార్టీ సీనియర్ నాయకులు కృష్ణంరాజు

- మండలంలో లోసరి, ఎల్‌వీఎన్ పురం, రాయలం, చినఅమిరం, గొల్లవానితిప్ప, దిరుసుమర్రు తదితర గ్రామాలలో నూతనంగా మంజూరైన పింఛన్లను సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ పాలకసభ్యులు అందజేశారు.

ప్రజల ఆరోగ్యమే జగన్‌కు ముఖ్యం

కాళ్ల: ప్రజలను ఆరోగ్యంగా ఉంచటమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య ఉద్దేశమని డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నరసింహారాజు అన్నారు. మండల కేంద్రమైన కాళ్ల గ్రామంలో ప్రభుత్వ ఆసుపత్రి వద్ద బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాట్లాడారు. పేద వర్గాల వారు ఆరోగ్యవంతంగా ఉండాలనే ఉద్దేశంతో సీఎం జగన్ ఈనెల 30న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభిస్తున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో ఈనెల 15 నుంచి వైద్య సిబ్బంది ప్రతి గ్రామానికి వెళ్లి ప్రజల యోగక్షేమాలు తెలుసుకొని, వైద్య పరీక్షలు నిర్వహించాలని అన్నారు. ఈ నెల 30 తరువాత వైద్య సిబ్బంది ఆయా గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఉచితంగా వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బందా విజయ, ఎంపీపీ పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు, జెడ్పీటీసీ పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఎంపీటీసీ సత్యవతి, వీరమల్లు బోసు, గుండా సాయి, గంటా బాలు, వడ్డికాసులు అబ్బులు, మహంకాళి, ముఖేష్, డాక్టర్లు సునీల్, గులాబ్ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కాళ్ల ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మాట్లాడుతున్న పీవీఎల్ నరసింహారాజు

చంద్రబాబును జైలులోనే ఉంచి విచారించాలి

తణుకు టౌన్: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్‌లో స్కామ్‌లో అవినీతికి పాల్పడకపోతే ఢిల్లీ నుంచి రోజుకు రూ.కోటి 50 లక్షలతో ఖరీదైన న్యాయవాదులతో వాదించడమెందుకు అని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు చీకటిమిల్లి మంగరాజు ప్రశ్నించారు. బుధవారం ఆయన తణుకులో మాట్లాడుతూ స్కిల్ స్కామ్‌లో చంద్రబాబు నాయుడును సీఐడీ అన్ని ఆధారాలతో అరెస్ట్ చేసిందన్నారు. చంద్రబాబు 45 ఏళ్ల కాలంలో ఎన్నో అవినీతి కేసుల్లో ఇరుక్కున్నా వ్యవస్థలను అడ్డుపెట్టుకుని తప్పించుకున్నారన్నారు. ఇప్పుడు స్కిల్ స్కామ్‌లో అడ్డంగా దొరికిపోయి బుకాయిస్తున్నారన్నారు. నూరు గొడ్లను తిన్న రాబందు ఒక గాలి వానకు కొట్టుకుపోయినట్లుగా ఇప్పుడు చంద్రబాబు పరిస్థితి తయారైందన్నారు. గతంలో ఓటుకు నోటు కేసులో తప్పించుకుని అంతేకాకుండా 30అవినీతి కేసుల్లో కోర్టుల్లో స్టేలు తెచ్చుకుని నేను నిప్పు, ఉప్పు అంటూ ప్రగాల్భాలు పలికాడన్నారు. ఇప్పుడు తుప్పుగా తేలిపోయిందన్నారు. చంద్రబాబును హౌస్ అరెస్ట్‌గా కస్టడీని ఇస్తే సాక్ష్యాలను ప్రభావితం చేస్తారని, అందుకు జైలులోనే ఉంచి విచారణ చేయాలన్నారు. చంద్రబాబు చేసిన అమరావతి భూకుంభకోణం, పోలవలరం సబ్ కాంట్రాక్టులు, ఇన్నర్ రింగ్ రోడ్డు, వంటి కేసుల్లో విచారణ జరిగితే చంద్రబాబు చేసిన అవినీతి వల్ల అతని జీవితం జైలులోనే గడిచిపోతుందన్నారు. ఈ అవినీతిలో భాగం ఉన్న లోకేశ్, అచ్చెన్నాయుడుతో పాటు ఇతరులను కూడా అరెస్ట్ చేసి విచారణ జరపాలని కోరారు. చంద్రబాబు, లోకేశ్, పవన్ కళ్యాణ్, ఎల్లో మీడియా ఎన్ని అసత్య ప్రసారాలు చేసినా రాబోయే ఎన్నికలలో వైఎస్సార్ సీపీ విజేతగా నిలిచి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రిగా ఎన్నికవుతారని చెప్పారు. ఈ సమావేశంలో నాయకుకులు సీహెచ్ గోపీ, ఎం.కిరణ్, వి.సునీల్ బాబు, బి.సందీప్, చిట్టిరాజు తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు


ఎమ్మెల్సీ వంక పరామర్శ



మాజీ ఎమ్మెల్యే కృష్ణారావును పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, తదితరులు

తణుకు టౌన్: తణుకు మాజీ ఎమ్మెల్యే ముళ్లపూడి వెంకట కృష్ణారావు సతీమణి లక్ష్మీ మృతి పట్ల ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ సంతాపం తెలిపారు. బుధవారం తణుకు రూరల్ మండలం ముద్దాపురంలోని మాజీ ఎమ్మెల్యే కృష్ణారావు నివాసంలో లక్ష్మీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణారావును, కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. ప్రముఖ పారిశ్రామికవేత్త చిట్టూరి నరేంద్ర, జెడ్పీటీసీ ముళ్లపూడి అన్నపూర్ణదేవి, సర్పంచ్ మజ్జి పద్మ, ఎంపీటీసీ కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తుమ్మగంటి నాగ సత్యనారాయణ, ముళ్లపూడి బాబూరావు తదితరులు కృష్ణారావును పరామర్శించారు.

దివ్యాంగులకు వీల్‌చైర్ల వితరణ



దివ్యాంగులకు వీల్‌చైర్లు అందిస్తున్న త్రిపుల్ ఎఫ్ కర్మాగార ప్రతినిధులు

పెంటపాడు: ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవరచుకోవాలని త్రిపుల్ ఎఫ్ కర్మాగార ప్రతినిధులు ఓపీ గోయంకా పేర్కొన్నారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రత్తిపాడు త్రిపుల్ ఎఫ్ కర్మాగార స్వాభిమాన్ ట్రస్టు ద్వారా బుధవారం రాచర్ల, ప్రత్తిపాడు గ్రామాలకు చెందిన దివ్యాంగులకు వీల్ చైర్లను బహూకరించారు. ఈ సందర్భంగా దివ్యాంగులు యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రణవ్ గోయంకా, జీఎం జనార్దన్, ఏజీఎం శ్రీనివాసరెడ్డి, కో ఆర్డినేటర్ శ్రీనివాస్, హెచ్‌ఆర్ సత్యనారాయణ త్రిపుల్ ఎఫ్ కర్మాగార ప్రతినిధులు, స్వాభిమాన్ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా మాసశివరాత్రి పూజలు



పుష్పాలంకరణలో శివయ్య



ధర్మాపుర అగ్రహారంలో అన్నాభిషేకం చేసి హారతి ఇస్తున్న దృశ్యం

ఆకివీడు: శ్రావణమాస మాసశివరాత్రి సందర్భంగా శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. ఆలయాల్లో భోళాశంకరుడికి అభిషేకాలు నిర్వహించారు. స్థానిక రాజరాజేశ్వరి సహిత మార్కండేయేశ్వరస్వామి, ధర్మాపుర అగ్రహారం పురాతన శివలింగం, పిల్లలమర్రి అగ్రహారం వేంకట లింగేశ్వరస్వామి, భీమేశ్వరస్వామి, మల్లేశ్వరస్వామి, అయిభీమవరం మదనగోపాలస్వామి ఆలయాలతో పాటు పలు గ్రామాల్లోని శివాలయాల్లో అభిషకాలు, ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, బిల్వార్చన, అన్నసమారాధనలు నిర్వహించారు. ఆయా ఆలయాల్లో భక్తులకు ప్రసాదవితరణ చేశారు.

పేటీఎం ద్వారా రుణ వాయిదాలు చెల్లించండి

ఉండి: స్త్రీనిధి మహిళా బ్యాంక్ ప్రారంభించిన పేటీఎం పద్ధతి ద్వారా రుణ వాయిదాలు చెల్లించాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎంఎస్ఎస్ వేణుగోపాల్ అన్నారు. బుధవారం ఉండిలో నిర్వహించిన సమావేశంలో డ్వాక్రా వీవోఏలకు పేటీఎం మెషీన్‌ను ఆయన అందజేశారు. స్త్రీనిధి రుణ వాయిదాలు పేటీఎం ద్వారా చెల్లించాలన్నారు. ఈ విధానాన్ని జిల్లాలో మొట్టమొదటిగా ఉండి మండలంలో ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. డెబిట్, క్రెడిట్ కార్డు, ఫోన్ పే, గూగుల్ పే క్యూ ఆర్ కోడ్ స్కాన్ ద్వారా కూడా వాయిదాలు చెల్లించవచ్చన్నారు. ఈ విధానం వల్ల నగదు లావాదేవీల్లో అవకతవకలకు అవకాశం ఉండదని తెలిపారు. వెంటనే రసీదు కూడా పొందవచ్చన్నారు. ఉండి మండలంలో 42 గ్రామ సమాఖ్యల్లో 544 స్వయం సహాయక సంఘాల ద్వారా రూ.14.86 కోట్లు రుణాలు ఇవ్వగా రూ.6.32 కోట్ల నిల్వ ఉందని చెప్పారు. అక్టోబరు నెల నుంచి ఈ పద్ధతిలో వాయిదాలు చెల్లించాలని అన్నారు. అనంతరం జిల్లాలోని అత్తిలి, ఆచంట మండలాల్లో అమలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో స్త్రీనిధి ఏజీఎం పి.శశికుమార్, స్త్రీనిధి మేనేజర్ పి.శ్రీరామ్, ఏపీఎం జి.శేషవేణి, సీసీలు రాంబాబు, రామలక్ష్మి, కన్యాకుమారి, వీవోఏలు పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్ ఛైర్మన్‌గా పడాల

ఆకివీడు: ఆకివీడు నగర పంచాయతీ అర్బన్ హెల్త్ సెంటర్ ఛైర్మన్‌గా నగర పంచాయతీ చీఫ్ విప్ పడాల శ్రీనివాసరెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నర్సింహరాజును ఆయన బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. హెల్త్ సెంటర్ కమిటీ కో ఛైర్మన్‌గా డీపీఎంఓ సుగుణరాజు, కార్యదర్శిగా మెడికల్ అధికారి వెంకటపతిరాజు, సభ్యులుగా కమిషనర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నకుమారి, మెప్మా అధికారి అనిల్ కుమార్, శానటరీ ఇన్‌స్పెక్టర్, హెల్త్ ఇన్‌స్పెక్టర్లు ఉంటారని శ్రీనివాసరెడ్డి వివరించారు.

గూడెంలో 28.8 మి.మీ. వర్షపాతం నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, పరిసర గ్రామాల్లో గడిచిన 24 గంటల్లో 28.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ వై.దుర్గాకిషోర్ బుధవారం తెలిపారు. పెంటపాడు మండలంలో 29 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందన్నారు.

క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో రుద్ర హోమం

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో మాసశివరాత్రి సందర్భంగా బుధవారం రుద్ర హోమం నిర్వహించారు. ఆలయ అభిషేక పండిట్ భమిడపాటి వెంకన్న బ్రహ్మత్వంలో జరిగిన ఈ హోమంలో 49 మంది దంపతులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలు అనంతరం భక్తులకు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి యాళ్ల సూర్యనారాయణ, ట్రస్ట్‌బోర్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రోగి వైద్యానికి వసుధ ఆర్థిక సహాయం

పాలకొల్లు అర్బన్: మొగల్తూరు మండలం కేపీ పాలెం గ్రామానికి చెందిన బి.రమేష్ దంపతుల కుమార్తె సంకీర్తన బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతుంది. రమేష్ ఆర్థిక పరిస్థితిని తెలుసుకుని వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకట్రామరాజు రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఈ సహాయాన్ని బుధవారం సంకీర్తన తండ్రి రమేష్‌కు ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు చేతుల మీదుగా అందజేశారు. వైద్యానికి ఆర్థిక సహాయం అందజేసిన ఫౌండేషన్ ఛైర్మన్ వెంకట్రామరాజుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.